క్లుప్తంగా

ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రుద్రగౌడ

కోసిగి: మండల కేంద్రం కోసిగి మీదుగా చెన్నై- ముంబాయి ప్రధాన రైల్వే మార్గం డబుల్ ట్రాక్ ఉండడంతో గేటు తరుచూ వేస్తుండడంతో వాహనదారులు, ఉరుకుందకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను దృష్టి ఉంచుకుని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహసీల్దార్ రుద్రగౌడ, సర్వేయర్ బసవరాజు, సర్పంచ్ అయ్యమ్మలతో కలిసి స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పెట్రోల్ బంక్ పక్కనే రైల్వే మైలు రాయి 523/6, 523/7 వద్ద నుంచి ఉరుకుంద రోడ్డు వరకు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. గ్రామ పెద్దలు సమక్షంలో స్థల కేటాయింపు పరిశీలన అనంతరం ప్రజల ఆమోదంతో జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడి మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31 నుంచి 319వ ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



కొల్మాన్‌పేటలో ఇంటి వద్ద వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ అభిరూప్

కోసిగి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక 3వ వార్డులో పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ కుమార్, కొల్మాన్ పేట గ్రామంలో డాక్టర్ అభిరూప్ వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌లో గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓలు ఉదయ్, కృపానందం, ఏఎన్‌ఎంలు సుజాత, అమ్రిన్ బానూ, హెల్త్ అసిస్టెంట్ బలరాం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్ : పశువులకు సంబంధించిన వ్యాధులను అరికట్టడానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పశువుల వ్యాధి నిర్ధారణ కోసం పేడ, రక్తం, మూత్ర పరీక్షలను చేస్తున్నట్లు చెప్పారు. అత్యవసర సమయంలో పశువుల కోసం ప్రభుత్వం 1962 అంబులెన్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వర్షాకాలంలో పశువులను చెట్ల కింద కాకుండా పాకలోనే ఉంచాలని సూచించారు. ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, వాటికి నీటిని అందుబాటులో ఉంచాలని కోరారు.

యువతికి వేధింపులు.. యువకుడి అరెస్ట్

మంత్రాలయం : మండలంలోని మాధవరం తండాకు చెందిన ఓ యువతిని ఇన్‌స్టాగామ్ ద్వారా వేధిస్తున్న హైదరబాద్‌కు చెందిన సంజయ్ ఎస్ రాథోడ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సంజయ్‌ని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించినందున ఆ యువతి, ఆమె తల్లిదండ్రులను ఇన్‌స్టాగామ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ, బెదిరిస్తూ, వేధింపులకు గురి చేసేవాడన్నారు. గ్రామంలో కొందరి సహాయంతో వారి సెల్ ఫోన్‌లో అకౌంట్‌లు ఓపెన్ చేసి అశ్లీల పోస్టులు పెడుతూ, మెసేజ్‌లు, ఫొటోలు పంపుతూ వేధించసాగాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతికంగా ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

మరో పదిహేను రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. విద్యార్థులను తీసుకెళ్లి, వదిలే పాఠశాలల బస్సుల కండీషన్‌పై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసి, ధ్రువపత్రం ఇస్తున్నారు. సర్టిఫికెట్ లేకుండా ఏ బస్సు రోడ్డెక్కడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్లకు మించకుండా, ఆరోగ్య వంతుడై ఉండాలని, ఇందుకు వైద్యులతో పరీక్షలు చేయిస్తోంది. ఇక బస్సుల రూపు రేఖలు, నిబంధనలను ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం సంబంధిత అధికారులు బస్సుల సామర్థ్య పరీక్షల్లో బిజీగా ఉన్నారు.

బస్సును నడిపి పరీక్షిస్తున్న ఎంవీఐ సిసిరాదీప్తి



బడి బస్సు భద్రమేనా!

- విద్యాలయాల పునః ప్రారంభానికి ముందే బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష
- సామర్థ్య సర్టిఫికెట్ లేకుండా రోడ్డెక్కితే కఠిన చర్యలు
- డివిజన్‌లో 85 బస్సులు
- ఫిట్‌నెస్ చేయించుకున్న 25 బస్సులు

ఆదోని అర్బన్ : విద్యార్థులు పాఠశాలలకు వచ్చి వెళ్లేందుకు ముఖ్య రవాణా సాధనంగా బడి బస్సు ఉంటోంది. చిన్నారుల చదువుతో పాటు భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. చిన్నారుల భద్రతకు పూర్తి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత విద్యాసంస్థలపైనే ఉంది. కాలం చెల్లిన బస్సులతో విద్యార్థులకు ముప్పు ఉంటుందని, పాఠశాలల పునః ప్రారంభమయ్యే లోపు ప్రైవేట్ విద్యాసంస్థలు బస్సుల సామర్థ్యంపై రవాణాశాఖ అధికారులు దృష్టి తనిఖీలు చేసి సర్టిఫికెట్ ఇస్తేనే రోడ్డెక్కాలని ఆదేశించింది. దీంతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు.

బస్సులకు పరీక్షలు..

విద్యార్థులకు పరీక్షలు ముగిసి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం వారిని తీసుకెళ్లే బస్సులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల భద్రత, క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాలయాల ప్రారంభానికి ముందే బస్సులు విధిగా ఫిట్‌నెట్ పరీక్షలు చేయించుకోవాలి. ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి ఆయా విద్యాసంస్థల బస్సులు పరీక్షలు చేయించుకుంటున్నాయి. డివిజన్ పరిధిలో 120 బడి బస్సులు ఉన్నాయి. అందులో పది బస్సులు కాలం చెల్లినవి. పాఠశాల మూసివేసినవి ఉన్నాయి. ప్రస్తుతం 25 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. ఇంకా 85 బస్సులు చేయించుకోవాల్సి ఉంది. రవాణాశాఖ అధికారులు వీటికి సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం బస్సు కండీషన్‌తో పాటు సీట్లు, లైట్లు, కిటికీల వద్ద గ్రిల్స్ వంటి వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అన్ని సవ్యంగా ఉంటేనే నిర్ధారణ అయ్యాక ఆ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మోటార్ ఇన్‌స్పెక్టర్‌లు జారీ చేస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

- స్కూల్ బస్సుకు ఎడమవైపున పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నంబర్, చిరునామా పూర్తిగా కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలకు మించరాదు. ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- లైసెన్సు తప్పనిసరి.
- డ్రైవర్లు ప్రతి మూడు నెలలకోసారి షుగర్, బీపీ, కంటి పరీక్షలు చేయించుకొని సమస్యలు లేవనే సర్టిఫికెట్ సమర్పించాలి. దానిని బస్సులో ఉంచుకోవాలి.
- ప్రతి బస్సుకు అటెండర్ ఉండాలి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల వివరాలు ఉండాలి.
- బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు ఉంచాలి.
- బస్సుకు తలుపులు ఉండడంతో పాటు అత్యవసర ద్వారం పనిచేసేటట్లు చూసుకోవాలి.
- కిటికీలకు మధ్య రెండు లోహపు కడ్డీలను అమర్చాలి. బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలి.
- బస్సు నుంచి పొగ రాకుండా చూడాలి. బ్రేక్ కండీషన్‌లో ఉండాలి.
- స్పీడో మీటర్ పని చేయాలి. స్టీరింగ్, టైర్లు కండీషన్‌లో ఉండాలి.
- సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించరాదు. బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాలు రూట్ ప్లాన్‌లో ఉండాలి.
- పిల్లలకు సులువుగా బస్సు ఎక్కేందుకు వీలుగా ఫుట్‌బోర్డు ఏర్పాటు చేయాలి.
- పాఠశాల బస్సు పసుపు రంగులోనే ఉండాలి.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి



పాఠశాలలు, కళాశాలలు తెరిచేలోపు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఫిట్‌నెస్ చేయించకుండా రోడ్డుపైకి వచ్చే బస్సుల కోసం ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థల యాజమాన్యాలు తమ బస్సులను సెలవులకు ముందే సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవాలి.

– సిసిరాదీప్తి, ఎంవీఐ

'వలంటీర్లకు వందనం'లో మార్పులు

ఆదోని అర్బన్ : వలంటీర్లకు వందన కార్యక్రమంలో మార్పులు జరిగాయని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 27, 29, 30వ తేదీల్లో జరగాల్సిన వలంటీర్లకు వందన కార్యక్రమం కేవలం 27వ తేదీన మాత్రమే జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ క్రీడా మైదానంలో 27న 1 నుంచి 11 వార్డుల వలంటీర్లకు, 16, 22, 23, 24 వార్డులు, 30–34 వార్డులు, 38–42 వార్డుల వలంటీర్లకు ప్రశంసా పత్రాల పంపిణీ, సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని ఇస్వీ బైపాస్ రోడ్డులో రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. అందులో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన అంజి, రవి ఒక బైకుపై ఇస్వీకి వెళ్తుండగా అదే రోడ్డులో ఇస్వీ గ్రామానికి చెందిన అశోక్, మహ్మద్ మరో బైకుపై గ్రామం నుంచి వస్తుండగా రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భార్యాభర్తకు..

కోసిగి మండలం సాతనూరు గ్రామానికి చెందిన కాశిం, ఫాతిమా గురువారం బైకుపై వెళ్తుండగా ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కోసిగి గ్రామ సమీపంలో భార్యాభర్తలైన ఫాతిమా, కాశిం బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఆదోని రూరల్ : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ దానమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు ఆయాశాఖల పనితీరుపై చర్చించారు. వాటిని పరిష్కరించేందుకై కృషి చేయాలని ఎంపీడీఓ గీతావాణి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయా అంశాలపై చర్చ అనంతరం కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఎంఈఓ శివరాములు, డిప్యూటీ తహసీల్దార్ వలిబాషా, హౌసింగ్ డీఈ రవికుమార్, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఉపాధి హామీ ఏపీఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ ఏపీఎం జనార్దన్, ఏఓ పాపిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా సబ్సిడీ విత్తనాలు

కోసిగి: సబ్సిడీపై వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను పంపిణీ చేయడానికి ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయనికి వ్యవసాయాధికారి రాజు తెలిపారు. గురువారం మండలంలోని అగసనూరు, సాతనూరు గ్రామాల సచివాలయాలకు చేరిన విత్తనాలు, వాటి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇందులో వేరుశనగ 320 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వేరువనగ క్వింటా మార్కెట్ ధర రూ.9,300 ఉండగా 40శాతం సబ్సిడీ రూ.3,720 పోను రైతు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక ఎకరా రైతుకు రెండు బస్తాలు చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాలకు రైతులకు 3 బస్తాలు మాత్రమే ఇస్తామన్నారు. అలాగే పిల్లిపెసర మార్కెట్‌లో క్వింటా ధర రూ.9,700 ఉండగా 50 శాతం సబ్సిడీ ప్రకారం రూ.4,850



రైతు భరోసా కేంద్రంలో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రాజు

చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జీలుగ విత్తనాలు 40 క్వింటాళ్లు మంజూరు కాగా క్వింటం ధర రూ.7,900లకు 50శాతం సబ్సిడీ పోనూ రూ.3,950 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అవసరమైన రైతులు పొలం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

లింగాలదిన్నెలో కంటి వైద్య పరీక్షలు

కౌతాళం: మండలంలోని లింగాలదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గురువారం ఉచిత కంటి పరీక్షలను గ్రామ సర్పంచ్ వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో కర్నూల్ అమీలియా ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 25 మందికి ఆపరేషన్లు అవసరమని తేల్చారు. వారిని కర్నూల్‌కు రెఫర్ చేశారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఆ 25 మందికి ఎమ్మెల్యే సహకారంతో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యుడు ఈరన్న తెలిపారు.

ఆదోని రూరల్ : పట్టణంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ నగర్‌లో శంకరానంద సరస్వతి ప్రాంగణంలో గురువారం వై.పి.నాగరాజు, కుమారస్వామి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. స్టార్ నర్సింగ్‌హోం ఆస్పత్రి డాక్టర్‌లు ఎస్.శాంతి, ఎస్.జ్యోతి, నోబుల్ కేర్ నర్సింగ్ హోం ఆస్పత్రి నుంచి డాక్టర్ సైపుల్లా పాల్గొని రోగులను పరిశీలించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 200 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, ఆర్థో తదితర పరీక్షలు చేశారు.

చక్కెర లోడు లారీ బోల్తా

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామ సమీపంలో గురువారం చక్కెర లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కర్నాటక నుంచి చక్కెర లోడుతో కాళహస్తికి వెళ్తున్న లారీ దేవనబండ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్ నాగేశ్వరరావు, క్లీనర్ రామానాయుడును గ్రామస్తులు సురక్షితంగా బయటకు తీశారు.

మరో రోడ్డు ప్రమాదం

వెల్దుర్తి: స్థానిక అభయాంజనేయ స్వామి సర్కిల్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్‌పోస్టు వద్ద



దేవనబండ సమీపంలో బోల్తా పడిన లారీ

హైవే–44పై గురువారం సాయంత్రం లారీ బోల్తా పడింది. గొర్రెల ఎరువు లోడ్‌తో కర్నూలు నుంచి రాయదుర్గం వెళ్తున్న లారీ చెక్‌పోస్టు వద్ద ఉన్న స్పీడ్‌బ్రేకర్ల వద్ద అదుపుతప్పింది. పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని ఒక పక్కకు పడిపోయింది. లారీ డ్రైవర్‌తో పాటు అందులోని ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు ఘన వీడ్కోలు

పత్తికొండ రూరల్: చిన్నహుల్తి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శ్రీనివాసులు (42) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో గురువారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 2004లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లో పనిచేస్తున్న ఈయన హైదరాబాద్‌లో సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్‌లో భార్యపిల్లలతో కలిసి ఉంటున్నారు. సెలవుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి ఇంటి వద్ద విద్యుత్ మోటార్ రిపేర్ చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సైనిక సిబ్బంది మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి పత్తికొండ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య శారదమ్మ, కుమార్తె భార్గవి, కుమారుడు శ్రీహరి ఉన్నారు.



సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్ : వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌కేడీ కాలనీలో చిల్డ్రన్ పార్క్ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 12–21, 25–29 వార్డుల వలంటీర్లకు పురస్కారాలు అందించారు. పట్టణంలో 643 మంది వలంటీర్లు ఉండగా 574 మందికి అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ముగ్గురికి సేవా వజ్ర , ఆరుగురికి సేవా రత్న, 565 మంది సేవా మిత్రకు ఎంపికయ్యారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కరోనా లాంటి కష్ట కాలంలో కూడా పథకాలు అందజేసి అండగా నిలిచాడని, ఇప్పటికే ఎన్నో కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకుంటున్నాడని వివరించారు. పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇంటి వద్దకే పథకాలు అందేలా వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి నూతన చరిత్రకు తెరతీశారని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. వలంటీర్లు కూడా అర్హులకు పథకాలు అందజేయాలని సూచించారు. జగనన్న ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నిబద్ధతగా పనిచేయాలని కోరారు. పురపాలక చైర్మన్ బోయ శాంత, పురపాలక కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, పురపాలక సహాయ చైర్మన్ నరసింహులు, పురపాలక మేనేజర్ భాస్కర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వలంటీర్లు, సచివాలయ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాయి

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత కోసిగి

కోసిగి: మండల కేంద్రంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ టోర్నమెంట్ విజేతగా కోసిగి జట్టు నిలిచింది. గురువారం కోసిగి, ఆలూరు జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఆలూరుపై కోసిగి జట్టు విజయం సాధించిందిది. గెలుపొందిన జట్లులకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేల నగదును అందజేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారంను తొలింగచడమే కాక సచివాలయం–3 వైపు వెళ్లే రోడ్డులో డ్రైనేజీ బ్లాక్ కావడంతో కల్వర్టులో చెత్తను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : పట్టణంలోని బొబ్బలమ్మగుడి వద్ద అమరావతి అంజి అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై గురువారం 10 బాక్సులు కర్ణాటక మద్యం తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. అంజిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి

ఆదోని రూరల్ : భూయాజమాన్య హక్కు పత్రాలతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేసి కౌలు రైతులకు న్యాయం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.పంపన్నగౌడ్, కె.తిమ్మయ్య కోరారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులు, పరికరాలు, బ్యాంకు రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి అంజనయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విరుపాక్షి, ఆదోని సీపీఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ పాల్గొన్నారు.

గైనకాలజిస్టు నియామకం



గైనకాలజిస్టు కల్పన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ కేంద్రంలో గైనకాలజిస్టుగా డాక్టర్ కల్పన గురువారం విధుల్లో చేరారు. గతంలో పత్తికొండలో పనిచేస్తున్న కల్పన కొన్ని నెలల క్రిందట డిప్యుటేషన్‌పై ఆలూరు వెళ్లారు. నాటి నుంచి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్‌లకు బ్రేక్ పడింది. ఇటీవల జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేయగా గైనకాలజిస్టు లేక గర్భిణులు, బాలింతల ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నారు. వారి చొరవతో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ కల్పనను తిరిగి పత్తికొండకు నియమించారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం



లబ్ధి పొందిన పథకాల గురించి మహిళకు వివరిస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం/కౌతాళం : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం కౌతాళం మండలం మెళిగనూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వర్తించిన తీరు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా.. లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా ఒరిగేదేమి లేదన్నారు. ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. పార్టీలన్నీ ఏకమై వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు తమ పార్టీకి విజయాన్ని తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. పేదలు జగనన్న పాలనలో ఎంతో సంతోషంగా ఉన్నారని ఉద్ఘాటించారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంతో పల్లెవాసుల సమస్యలు తెలుసుకునేందుకు ఆస్కారం ఉందన్నారు. త్వరలోనే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఇక్కట్లకు పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, మండల ఇన్‌చార్జ్ వెంకట్రామిరెడ్డి, నాయకులు మర్రిగౌడ్, రామన్నగౌడ్, సూపరింటెండెంట్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాండవగల్లు చెరువును రక్షించండి

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉన్న పెద్ద చెరువును రక్షించాలని, అందులో అక్రమంగా సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని పాండవగల్లు పెద్ద చెరువు సాధన కమిటీ సభ్యులు గ్రామ చెరువులో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కమిటీ కన్వీనర్ ఎం.తాహిర్‌వలి, నాయకులు రామదాసు, వెంకటేష్ మాట్లాడుతూ గతంలో డివిజన్ కోర్టు, జిల్లా కోర్టులు ప్రభుత్వ చెరువుగా తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. చెరువుపై ఓ మహిళ అక్రమంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందింది. దీంతో 2013లో మహిళ, చెరువు సాధన కమిటీ సభ్యులు హైకోర్టులో కేసు వేశారు. అయితే కోర్టు మహిళకు అనుకూలంగా స్టే ఇవ్వనప్పటికీ ఆమె చెరువుకు సాగు చేస్తుండటాన్ని అధికారులు అడ్డుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ సాగును అడ్డుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు గోపాల్, ఆంజనేయ, చిన్నతాయన్న, చంద్రశేఖర్, రంజాన్, రమాంజనేయులు, రాములు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



చెరువులో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పత్తికొండ టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని డీపీఓ నాగరాజునాయుడు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ జీవనశైలి కార్యక్రమంలో భాగంగా పత్తికొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. డీపీవో మాట్లాడుతూ.. 12 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని, ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, నీటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు